# అంగారతల్పం



శ్రీధర

వచ్చేవేళ అయింది. ఇటునుంచి ఈమె, అటునుంచి బస్సు.

రోజూ నీహారిక కోసం ఈ నిరీక్షణ మత్తుమందులా అలవాటైంది. అదో అందమైన వ్యసనమే అయింది. అయినా ఈ మనసు అలవాట్లకు ఎందుకింతగా దాస్యం చేస్తుందో - తనను తాను ప్రశ్నించుకుంటున్న సమయంలోనూ, ఆమె రాకకోసం వీధి కొసదాకా దృష్టి సారించకుండా ఉండలేకపొయ్యాడు.

బస్సు వచ్చింది. వెనక్కి మళ్లింది. అతను ఎక్కాడు. బయల్దేరింది. చివరి సారిగా అటు చూశాడు. ఆమె! సందేహం లేదు. మోహన్ బెల్ కొట్టాడు. డ్రైవర్ని రిక్వెస్ట్ చేశాడు. డోర్ తీసి రెడీగా పట్టుకున్నాడు. పరుగులాంటి నడకతో వచ్చి బస్సు ఎక్కిందామె.

ఇద్దరూ ఖాళీగా ఉన్న చివరి సీట్లో కూర్చున్నారు. రోజూ వాళ్ల స్థానం అదే. నగరానికి ఈ మూల వీళ్లుంటే పనిచేసే కంపెనీ మరో మూల ఉంది. గంటసేపు ప్రయాణం. ఈ బస్సు మిస్సయితే, ఇంక ఆ రోజుకు అంతే.

అంత శ్రమపడి బస్సు ఆపినా ఆమె థాంక్స్ అయినా చెప్పనందుకు మోహన్‌కు మనస్సు చివుక్కుమంది. ఆడజాతే అంత. వాళ్లకోసం మగాళ్లు ఏం చెయ్యటానికైనా పడిచస్తారన్న అహం.

ఆమె కిటికీలోనుంచి బయటకు చూస్తోంది. బస్సు కుదుపు ఉయ్యాల లూపుతుంటే, మోహన్ కళ్లు మూసుకున్నాడు. పావుగంట తర్వాత ఏడుస్తున్న శబ్దం వినపడితే, అటు చూసాడు. నీహారిక ముందుకు వంగి, చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది!

"ఏమండీ, ఎందుకేడుస్తున్నారు? ఏం జరిగింది?" పిలిచినా పలకకపోవడంతో భుజం పట్టుకుని కదిపాడు. తలెత్తి చూసింది. నేత్రాలు వర్షించిన మేఘాలే అయినయి. మొహం కన్నీటి చారికలతో మ్లానమైపోయింది.

"ఎందుకలా అయిపొయ్యారు?"

ఆమె మొహం తిప్పుకుంది. అతను అర్థంచేసుకున్నాడు. అంతరాంతరాల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నప్పుడు, అశ్రుధారగా లావా పొంగుతున్నప్పుడు, చెప్పటానికేంఉండదు. చూపుల్లో శూన్యం. మాటల్లో మౌనం.

కాసేపామె చుట్టూ గిరిగీసుకుని ఒంటరితనపు వనంలో ఆలోచనల నీడల కింద తారట్లాడింది. ఉదయపు ప్రశాంత పవనాలు సేదదీర్చినట్లున్నాయి. బస్సు దిగేటప్పటికి తేరుకుంది.

ఆఫీసులోకి వెళ్లాక ఊపిరి సలపని పనిలో అన్నీ మర్చిపొయ్యాడు.

సాయంత్రం మళ్లీ అదే బస్సు. అవే సీట్లు. నీహారిక ఈసారి అతన్ని చూసి నిస్తేజంగా నవ్వింది. జ్వరంపడి లేచినదానిలా నీరసంగా ఉంది.

"పొద్దున్న మీరేదో అడిగారు. నేను మాట్లాడలేదు. ఏమీ అనుకోకండి" అన్నదామె సంజాయిషీగా.

"అవతలవాళ్లు బాధలో ఉన్నప్పుడు, మామూలు మర్యాదలు ఆశించటం తప్పు. అయితే ఆ సమయంలో ఒక స్వాంతన వచనం పలకటం నావంతు బాధ్యతగా భావించాను" అన్నాడు మోహన్.

"ఓదార్పుకు కూడా నోచుకోని నిర్భాగ్యులుంటారు...."

"భగవంతుడు ముందుగా ఈ లోకాన్ని సృష్టించి, తర్వాత తమను ఇక్కడికి పంపించాడని చాలామంది అనుకుంటారు. కానీ ఇక్కడి కొచ్చాక ఎవరి లోకాన్ని వాళ్లే సృష్టించుకుంటున్నారని నా కనిపిస్తుంది. కనుక ఎప్పుడేనా ఒకసారి పరిస్థితులు మనల్ని నడిపించవచ్చు. కానీ మొత్తంమీద పరిస్థితుల్నే మనం నడిపించుకోగల స్తితిలో ఉండాలి...."

"మీకు వేరే పనేం లేకపోతే, ఎక్కడేనా దిగి కాసేపు మాట్లాడుకుందాం ...." అంది నీహారిక.

పావుగంట తర్వాత వాళ్లిద్దరూ సిద్ధార్థలో కూర్చున్నారు.

"నాకు బాగా ఆకలిగా ఉంది. కాఫీ ఏమన్నా తినటానికి డబ్బులేదు. అంచేత .... ఇలా అడుగుతున్నందుకు నా తల సిగ్గుతో వాలిపోతోంది...." అన్నదామె తలొంచుకునే.

"సిగ్గెందుకు? మనిషి చంద్రమండలం మీదకు వెళ్లొచ్చాడు. కానీ ప్రపంచ జనాభాలో సగంమందికి క్షుద్బాధ తీరటం లేదు. నా మటుకు నేను ఎన్నో రోజులు ఆకలితో సహజీవనం చేసాను.."

కావల్సినవేవో బేరర్‌కు ఆర్డరిచ్చాడు. తర్వాత ఆమెతో అన్నాడు. "చెప్పండి... మీకు అభ్యంతరం లేకపోతే, మీ ప్రాబ్లం ఏమిటో తెల్సుకోవాలని ఉంది...."

"చెబుతాను. నా ఈ అవిరామ జీవన సంగ్రామంలో నేను చిత్తుగా ఓడిపొయ్యాను. మనసుకు శాంతి లేదు. కంటికి భవిష్యత్కాంతి లేదు. అంతా కటిక చీకట్లో తడుముకుంటున్నట్లుగా ఉంది...." అంటూ ఆగిపోయింది.

"ఫర్వాలేదు, చెప్పండి" అని ప్రోత్సాహాన్ని ఇచ్చాడు మోహన్.

"దారిద్ర్య రేఖకు దిగువన కొట్టు మిట్టాడుతున్న కుటుంబంలో పుట్టినా, నేను పెద్దగా దేనికీ బాధపడలేదు. అయితే వయసొచ్చేకొద్దీ, మనసు ఏవేవో ఊహించుకునేది. కళ్లు అస్తమానం కలలు కంటుండేవి. ఆశల విహంగాలమీద ఎక్కడెక్కడికో వెళ్లేదాన్ని. కానీ, ఎదురైన కటువైన వాస్తవం వేరే పాఠాలు నేర్పింది. అయిష్టంగానే పెద్దవాళ్లు కుదిర్చిన సంబంధానికి తల వొంచాను. కొత్తచోటికి వచ్చాను. నాకో భర్త, అత్తా, ఆడబిడ్డా, మరిదీ ఉన్నారు. ఆయన సంపాదన ఆయన సరదాలకే చాలదు. మరిదికి పనీపాటా లేదు. హస్త లాఘవం ప్రదర్శించి అడపాదడపా పోలీసువారి కోరికమీద జైల్లో జస్ట్ గెస్ట్ ఆర్టిస్టుగా ఉండొస్తుంటాడు.

"వాళ్లందరికీ నెలాఖరుకు నేను తెచ్చే వెయ్యిరూపాయలే జీవనాధారం. గడియారం ముల్లతో పాటుగా నేనూ నిముషం ఆగకుండా పరుగెత్తుతున్నాను. ఇంటా బయటా చాకిరీ చేస్తున్నాను. ఇంత కష్టపడుతున్నా, ఎవరికీ తృప్తి లేదు. నన్ను చూడగానే అత్తగారికి ఎక్కడలేని రోగాలూ వచ్చేస్తయి. ఆడబిడ్డకు పితూరీలు చెప్పడం కన్నా మరో పనిలేదు. దెప్పుళ్లూ. మొగుడికి ఫిర్యాదులు. చేతగానివాడికి శౌర్యం ఎక్కువ.




వనీ- వాళ్ల మాటలు విని నన్ను రోజూ తిట్టటం, కొట్టటం.... కాలే సిగరెట్టు పీకలతో వంటిమీద చురకలు.... జుట్టు పట్టుకు గుంజితే, తల ఊడిపోతుందేమో నన్నంత నెప్పి— చెంపమీద కొడితే దవడపళ్లు కదిలి, ఒకటే సలుపు.... ఇంతోసి మొగుడు దొరకదేమోనని పది వేలు పోసి కొనుక్కున్నాను.... కనుక పుట్టింటికి పోలేను. కానీ, నా సహనం చచ్చిపోతోంది. ఎప్పుడో ఒకసారి ఆ యింట్లోనే ఎవర్నో ఒకర్ని చంపి, నేను చచ్చిపోతాను...." అంటున్న నీహారిక కళ్లలో బాధల ముళ్లు గుచ్చుకున్నట్లుగా, సుళ్లు తిరిగాయి కన్నీళ్లు.

"మీకు చచ్చే హక్కూ లేదు, చంపే హక్కూ లేదు" అన్నాడు మోహన్.

"నన్ను చిత్రవధ చేసే హక్కు వాళ్లకు ఉందా?" ఎంతో పౌరుషంగా అడిగిందామె.

"లేదు. కానీ మీకు తెలియకుండానే మీలో జీర్ణించుకుపోయిన బానిసత్వం వాళ్లకా హక్కు నిచ్చింది."

"అంటే?"

"పిరికివాళ్లెప్పుడూ పరాయివాళ్ల పద ఘట్టనల కింద నలిగిపోతూనే ఉంటారు. బలహీనుడిపై బలవంతుడు స్వారీ చేయటం అనాదిగా వస్తూనే ఉంది. ధైర్యం ఉంటే ఎదిరించండి...."

"వాళ్లు నలుగురూ, నేను ఒక్కదాన్ని...."

"ఆ నరకంలో మగ్గినంత కాలం, మీ పరిస్థితి అంతే.... బయటకు రండి. బంధనాలు తెంచుకోండి."

"గతాన్ని తెంచేసుకోవటం అంత తేలికా?" అని ఆశ్చర్యంగా అడిగింది.

"దృఢమైన మమతానుబంధాన్ని తెంచుకోవటానికైతే మనస్తాపంతప్పదు. కానీ మీ విషయంలో మమతలు లేవు. అను బంధాలు అంతకన్నా లేవు. సాయంత్రం వేళకు తలదాచుకోవటానికింత నీడ కావాలి కాబట్టి, మరెక్కడా చోటు లేదు కాబట్టి అక్కడకు వెళ్తున్నారు, అవునా?...."

"అవును, చాలా కరెక్టుగా చెప్పేరు.."

"కానీ అక్కడ నిద్రపట్టదు. సుఖం లేదు. పైగా చాకిరీ తప్పదు...."

"మీరు చెప్పింది నిజమే, కానీ పురుషాధిక్యత గల ఈ ప్రపంచంలో ఓ ఆడది ఒంటరిగా బ్రతకగలదా? దీపాలు వెలిగితే చాలు, లెక్కలేనన్ని పాపాలు

జరిగిపోతున్న ఈ రోజుల్లో ఒక్క దాన్నీ ఉండటం ఎంత భయం?...."

"మీకన్నా హీనంగా, దీనంగా, పరాధీనంగా బ్రతుకుతున్న వాళ్లెందరు లేరు? ముందు భయంలోనుంచి నిర్భయంలోకి, భావదాస్యపు బానిసత్వపు సుషుప్తిలోనుంచి, స్వేచ్ఛా జగత్తులోకి వచ్చే ప్రయత్నం చేయండి .... ఇంక ఒంటరితనం అంటారా? అధిక జనాభాతో కిక్కిరిసిపోతున్న ఈ దేశంలోఅది అంత తేలిక కాదు...."

అతను చెప్పిన మాటల్లో ఎంతో సత్యం ఉందనిపించింది. టిఫెను, కాఫీ పూర్తయ్యాక బయటకు వచ్చారు. మళ్లా బస్సు ఎక్కారు. దిల్‌సుక్‌నగర్‌లో దిగారు.

చెరో దోవ— ఆమె కోణార్క్ ముందు సందులోకి, అతను డిపో వెనుక వైపుకు. ఒకరు దక్షిణం, మరొకరు ఉత్తరం. కానీ ఈ ధృవాల మధ్య ఏదో కనిపించని బలమైన ఆకర్షణ ప్రారంభమైంది.

రాత్రి ఎనిమిదిగంటలైంది. మోహన్ డాబామీదే పిట్టగోడను ఆనుకుని ఒక్కడే కూర్చున్నాడు. వెన్నెల చల్లగా ఉంది. కానీ అతని మనసులో ఏ అనుభూతీ లేదు. ఆలోచనలు అంతకన్నా లేవు. అయినా ఏదో లోటుగా ఉన్నట్లుగా లీలగా తోచింది. అప్రయత్నంగానే చిరునవ్వు అలవోకగా మెరిసి మాయమైంది.

మనసుకు వయసొచ్చాక, కోరికలు శారికల్లా ఎగురుతుంటయి. కానీ ఇంత మందికి కనీసపు కోరికలు తీరే దారే ఉండదు.

మోహన్ తల్లి వచ్చింది. ఆమె ఎందుకొచ్చిందో అతనికి తెల్సు గనుక మాట్లాడలేదు. అయినా ఒక నిముషం ఆగి ఆమే మొదలుపెట్టింది.

"శాంత ఉత్తరం రాసింది.... వాళ్ల మామగారు పోయారట— ఎవరూ వెళ్లకపోతే బాధపడుతుంది.... పుట్టింటివాళ్లు వెళ్లి బట్టలుపెట్టి రావాలి.... వస్తూ తెనాలి వెళ్లి సావిత్రిని తీసుకురా.... పురిటికి ఎవరం వెళ్లలేదనే కోపంతో కార్డుకూడా రాయటంలేదు...."

"వాళ్ళు నీ కూతుళ్లు. వాళ్ల కష్టసుఖాల్లో ఆదుకోవల్సిన బాధ్యత నీది..."

"నీకు తోబుట్టువులు వాళ్లు. ఇంటికి నువ్వు పెద్దకొడుకువి...."

"నేను పెద్దకొడుకునని ప్రత్యేకంగా నా కిచ్చిన ఆస్తిపాస్తులు ఏమీలేవు. ఏనాడూ కడుపునిండా తిండయినా పెట్టలేదు. ఇంక ఆ ఇంట్లో చదువుసంధ్యల గురించి ఆశించటం అత్యాసే. గాలికి పెరిగాం — అయితే గాలికి కొట్టుకుపోకుండా నిలదొక్కుకున్నాను. అందుకని నీ బాధ్యతలన్నీ నామీదకు తోసేస్తావా?"

"ఎదిగిన పిల్లలు తల్లిదండ్రులను ఆదుకోవటం తప్పా? చెట్టుఅంత మనుషులు అయ్యాక కని, పెంచినవాళ్లకు కాస్తంత ఆశ్రయం ఇవ్వటం నేరమా? ఏం, కన్నకొడుకు సొమ్ము తినే హక్కు మాకు లేదా?" అని సూటిగా ఆవేదనగా ప్రశ్నించింది.

"బాధ్యతలు భరించినవాళ్లకే, హక్కు భుక్తం అవుతుంది. కర్తవ్యాన్ని విస్మరించినవాళ్లకు, హక్కుల గురించి నోరెత్తే హక్కులేదు."

"మేం ఏమీ చేయకుండానే, మీరంతా ఇంతవాళ్లు అయ్యారా?"

"పుట్టటం, పెరగటం, నశించటం— ఇది సృష్టిధర్మం. పశువులు. చెట్లూ కూడా పుట్టి, పెరిగి, తరిగిపోతుంటాయి. అలాగే మేమూ పెరుగుతున్నాం. కనుకనే కుటుంబంలో ఒకరికీ, మరొకరికీ మధ్య అతి సహజంగా ఉండాల్సిన ప్రేమలూ, అభిమానాలూ మన మధ్య లేవు. ఎంత కష్టం వచ్చినా, నష్టంవచ్చినా తల్లిదండ్రులను చూడాలని అనిపించదు. చెల్లెళ్లను, తమ్ముళ్లనూ దగ్గరకు తీయాలనీ లేదు నరనరాన రక్తంలో కల్సి సహజంగా ప్రవహించవల్సిన ప్రేమ మన ఇంట్లో ఎవరికీ లేదు. కారణం ఏమిటో ఎప్పుడూ నీకు స్ఫురించలేదా?...."

"నాకు చేతనయినంత వరకూ నేను చేశాను....ఇంక అంతకన్నా ఎవరు మాత్రం ఏం చేస్తారు?" అని నిష్కర్షగా అడిగేసింది.

"లేతవయస్సులో ఇంట్లో అమ్మా, నాన్నల ఆదరణ కరువైనవాళ్లు, కరుకు రాతిహృదయంతో పెరుగుతారు. వాళ్ళు కుటుంబానికే కాక, సమాజానికే పెద్ద సవాలుగా తయారవుతారు. నాకు తెల్సినంతవరకు ఈ ఇంట్లో గత పాతికేళ్లుగా ఎదురయింది ఒకే ఒక్క సమస్య – ఈ పూట ఎలా గడుస్తుంది? పగటిపూటే ఇది. మళ్ళీ రాత్రిపూట ఏ సమస్యా లేదు. అంటే పదిమంది పిల్లలా? వాళ్లంతా వెలవెలగొంతులతో ఆకలి కేకలా?.... నిద్ర ఎలా పడుతుంది? కోరిక ఎలా పుడుతుంది?"

"చివరకు నన్నే నేరస్తురాల్నిచేశావా? పోనీలే, ఈ దేశంలో అందరూ ఐశ్వర్యంతో తులతూగుతానంటే నే నిలాగే దరిద్రంలో మునిగితేలుతాను...."

"అదీ స్వయంకృతాపరాధమే. ఎవరి బాగుకు వాళ్లే తంటాలు పడాలిగానీ, ఇతరులు ఎందుకు ఆదుకోవాలి? ఎందాకా ఆదుకోవాలి? అసలు ఉన్న నలుగురూ కష్టపడితే, నాలుగురోజుల్లో కష్టాలు తీరిపోవా?...."


"కానీ ఎవరూ నామాట వినర్రా?..." అంది చివరకు ఆవేదనతో.

"వినని గాడిదలను వదిలేసి వినే ఒక్కగాడిదమీదా బరువంతా వేస్తే, దాని నడుం విరిగిపోదా?...."

"మీరు సుఖంగా ఉండాలనే గదా నా తాపత్రయం" అని కొద్దిసేపు ఆగి అడిగింది. "రేయ్ పెద్దోడా, డబ్బు ఏమన్నా

ఉంటే సర్దరా? తెల్లారితే బియ్యం లేవు, బొగ్గులేవు....”

మోహన్ దీర్ఘంగా నిట్టూర్చాడు. ఇంతసేపు వాగటం వృధాప్రయాసే అయినందుకు తనను తనే నిందించుకున్నాడు. పర్సులోనుంచి ఒక పాతిక తీసుకోమన్నాడు. తీసుకుని ఆమె వెళ్లిపోయింది, దుకాణాలు మూసేస్తారంటూ. కానీ 'నువ్వు ఈపూట అన్నం తిన్నావా?' అని ఒక్కమాట అమ్మ అడిగిఉంటే, మోహన్ కడుపు నిండిపోయ్యేది. కానీ ఆమెకా ఆలోచనే రానందుకు, కళ్లలో నీళ్లుతిరిగాయి. అంతలోనేనవ్వుకున్నాడు. ఇదేమిటి? ఇన్నేళ్లుగా లేని అలవాటు ఇవ్వాళ కొత్తగా ఎలా వస్తుంది.”



ఇంట్లో ఉండబుద్ధిగాక రోడ్డుమీదకు వచ్చాడు. నిద్ర ఎలాగూ పట్టేటట్లులేదు. పోనీ సినిమాకు వెళ్దాం అని రోడ్డు దాటుతుంటే నీహారిక కనిపించింది. చేతిలో బుట్ట, దానిలో ఏవో ఆకుకూరలు. పాత చీర కట్టుకుంది. ఆ సమయంలో అతని కంట పడినందుకు కాబోలు బేలగా నవ్వి, తల తిప్పుకుంది.

మోహన్ వెళ్లేటప్పటికి నాలుగు రూపాయల బుకింగ్ మూసేశారు. టిక్కెట్లు అమ్ముడయిపోయినయి. తనది అన్నిట్లోనూ వెనుకంజ. అందుకే అతి చిన్న కోరికలూ గగనకుసుమాలే అవుతున్నాయి. ఊరికే అటూఇటూ చూస్తుంటే లోపల టీస్టాల్ దగ్గర కూల్‌డ్రింక్స్ తాగుతున్న తండ్రి కనిపించాడు. ఇంకొంచెం ముందుకు వచ్చి చూస్తే, మూడురూపాయల క్యూలో నిలబడ్డ తమ్ముడు చూడనట్లు తల పక్కకు తిప్పేసుకున్నాడు.

మోహన్ నెమ్మదిగా నడుచుకుంటూ మళ్లీ రోడ్డుమీది కొచ్చాడు. ఆంజనేయస్వామి గుడిముందు అరుగుమీద కూర్చున్నాడు. చీకూ చింతాలేని గాలి రివ్వున వీస్తోంది. రోడ్డుమీద విజయవాడ వైపు వెళ్లే ఖరీదైన డీలక్స్‌బస్సు రంయ్యిన పోతున్నది. ఎన్నాళ్లు అయిందో, ఎక్కడికన్నా ప్రయాణంచేసి? వెన్నెల రాత్రి, కిటికీపక్కన కూర్చుని పరుగెత్తే ప్రకృతి దృశ్యాలవంక చూస్తూంటే - బాగానే ఉంటుంది. మళ్లీ నిట్టూర్పు. ఇది తీరని మరో చిన్న కోరిక.

తెల్లారితే బియ్యం లేవు, బొగ్గులేవని పాతికేళ్లుగా పరితపిస్తున్న తల్లి!

సినిమాలు చూస్తూ, డ్రింకులు తాగుతూ, తిరుగుతున్న తండ్రి!

తండ్రిని మించిన తనయులు!

డబ్బులేని కుటుంబాలు కూడా బాగుపడతాయి. కానీ డిసిప్లిన్‌లేని కుటుంబాలు ఎప్పటికీబాగుపడవు...శాంత, సావిత్రి... వాళ్ల అదృష్టం బాగుంది. ఆ మాత్రం

వాళ్ల అయినా వచ్చి కావాలని చేసుకున్నారు. కానీ వాళ్ల గతాన్ని మర్చిపోయ్యారు. అందరికిలాగా షట్టింటి మర్యాదలుజరగటంలేదనిగునుస్తున్నారు.

మర్నాడు కూడా నీహారిక ఆలస్యంగానే వచ్చింది- మోహన్ బస్సు ఆపించాడు ఆమె వచ్చేదాకా. మళ్లీ అవే సీట్లల్లో కూర్చున్నారు.

"సినిమా బావుందా?" అని అడిగిందామె. రాత్రి థియేటర్‌లోకి వెళ్లటం చూసింది కాబోలు.

చూడలేదని చెప్పాడు. మోహన్ నిన్న చెప్పిన సలహా గురించి రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలియజేసింది నీహారిక. అయితే, ఆ నిర్ణయాన్నిఅమలుచేయటంలోఅతనిసహాయం అవసరం అవుతుందని చెప్పింది. అందుకు ఎప్పుడూ సిద్ధమేనన్నాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలోనూ ఇదే విషయం చర్చించుకున్నారు.

"అక్కడ నాకు సుఖంలేదు. పైగా రోజూ తన్నులూ గుద్దులూ తప్పటం లేదు.... మొగుడు ముండా అంటే ముష్టి కొచ్చినవాడూ ముండా అన్నాట్ట అందరి ముందూ. ఆయన నన్ను కొడుతుంటే మిగిలినవాళ్లకూ లోకువైనాను. అందరూ ప్రతిదానికి నేనంటే ఒంటికాలిమీద లేస్తున్నారు...." అంది నీహారిక.

"అందుచేతనే కొన్నాళ్లు విడిగా ఉండి చూడండి.... అప్పుడు వాళ్లకే తెల్సొస్తుంది..."అని సలహాఇచ్చాడు మోహన్.

"కానీ నేను విడిగా ఉంటే ఆయన నన్ను బ్రతకనిస్తాడా?"

"అందాకావస్తే, ఆ ఏర్పాట్లు నేను చేస్తాను. వేధిస్తున్నట్లు పోలీసు రిపోర్టు ఇవ్వండి.... విడాకులకు నోటీసు ఇవ్వండి...."

"నాకు ముందు మీ ఇంటిదగ్గర్లో ఒక రూం చూసిపెట్టండి...."

"మా ఇంట్లోనే ఒక వాటా ఖాళీగా ఉంది...."

"రేపే అడ్వాన్స్ ఇచ్చెయ్యండి మరి" అంది నీహారిక.

బస్సు దిగేటప్పటికి వాన మొదలైంది. తలదాచుకోవటంకోసం బస్‌స్టాప్‌లోకి పరుగెత్తారు ఇద్దరూ. అప్పటికే అక్కడ జనం కిక్కిరిసి ఉన్నారు. అతనూ అక్కడే ఇరుక్కున్నాడు. అతని పక్కన ఆమె.

గాలీ, వానా విసురుగా రావటంతో పైనుంచి కురవటం లేదన్న మాటేగాని పక్కలనుంచి వాళ్లంతా తడిసిపోతూనే ఉంది. అయిదు నిముషాల్లోనే తడిముద్ద అయి అతుక్కుపోయినయి బట్టలు. నీహారిక కట్టుకున్న పలచని బట్టల్లోనుంచి బిగి 'బ్రా' కట్లు కనిపిస్తున్నాయి. రివ్వున మీదపడుతున్న వానజల్లుకు భయపడి ఆతన్ని మరింతగా అంటుకుపోయి నిలబడింది నీహారిక. అతను నవ్వుకుంటూ ఉంటే ఎందుకు నవ్వుతున్నారని అడిగిందామె.

"ఏదో గుర్తొచ్చింది...."

"ఏమిటో చెప్పండి...."

"ఆడదాని జాగ్రఫీ మీదే హిస్టరీ ఆధారపడి ఉంటుందిట...."

"మగాళ్లకీ అంతేనండోయ్...."

"కానీ ఇంతగా కాదండి.... ఏవో కొన్ని అవస్తలు కలిగించి భగవంతుడు తమకు అన్యాయం చేసాడని ఆడిపోసుకుంటారుగాని, సృష్టిలో మరెక్కడా లేని సౌందర్యాన్నంతా వాళ్ల శరీరంలోనే ఇమిడ్చి ఎంత గొప్ప మేలుచేశాడో గమనించరేం?"

"అలా గమనించేవాళ్లు వేరే ఉంటారు గదాని...."

ఇద్దరూ నవ్వుకున్నారు. వాన కురుస్తున్నందువల్ల ఇంకా అక్కడ చాలామంది ఉన్నా చుట్టూ ఎవరిలోకంలో వాళ్లున్నారు. మోహన్ వెనకనుంచీ ఎవరికీ కనిపించకుండా నీహారిక నడుం మీద చెయ్యివేశాడు. అప్పుడామె చూపులో తామసమే కనిపించిందతనికి.

వాన వెలసినందుకు అందరూ సంతోషించినా, వాళ్లిద్దరూ మాత్రం తిట్టుకున్నారు. విడిపోయ్యారు దక్షిణంగా, ఉత్తరంగా.

తర్వాత రెండు రోజులు నీహారిక కనిపించలేదు. మూడో రోజు వచ్చింది. ఎన్నాళ్లో జబ్బుపడి లేచినదానిలా అయిపోయింది. చూడగానే ఎప్పటిలాగే నవ్వాలని విఫలప్రయత్నం చేసింది. దార్లో చెప్పింది.

వాన కురిసిన సాయంత్రం బస్సుస్టాపులో మాట్లాడుకోవటం మరిది చూశాట్ట. మొగుడితో చెబితే, అతను యముడే అయినాట్ట. పైకికనిపించకుండా, పోలీసు దెబ్బలు కొడితే వాళ్ల హూనం అయిపోయి, జ్వరం వచ్చిందిట. ఇవ్వాళయినా జీతాలరోజు కాబట్టి వచ్చానని చెప్పింది.

"నా కోరికలేవీ తీరకూడదని నాకో శాపం ఉంది. అయినా ఆ సమయంలో మాత్రం మిమ్మల్ని ముట్టుకోవాలన్న బలమైన కాంక్షను తట్టుకోలేకపోయినాను. అందుకు మీరు శిక్ష ననుభవించారు...." అన్నాడు మోహన్.

"అదీ మంచిదే అయింది. ఇంతకాలం మనసులో ఏమూలో ఊగిసలాడుతున్న భయాందోళనలు మొన్న తన్నులు తినటంతో తెగిపోయినాయి. ఇప్పుడు బోలెడంత తెగింపు వచ్చింది. ఇంక దేనికీ, ఎవర్నీ లెక్కచేయవలసిన పని లేదు..." అన్నదామె.

ఆ సాయంత్రం నీహారిక పోలీసు స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేసింది. భర్త రోజూ తనని కొట్టి చంపుతున్నాడు కాబట్టి రక్షణ కావాలని కోరింది. ఇద్దరు కానిస్టేబుల్స్‌ను వాళ్లింటికి పంపి,

భర్తను పిలిపించి మందలిస్తానని ఆ అఫీసరు హామీ ఇచ్చాడు.

ప్లీడరు దగ్గరకూ వెళ్లి విడాకులకు నోటీసు ఇచ్చింది. తర్వాత మోహన్‌తో కలిసి వాళ్లింటికి వచ్చింది. కింద వాటాలో చేరింది. వారంరోజులుదాకా కలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయింది. మోహన్ రోజూ అమెచేతివంట తినటంతో తెల్సొచ్చింది, జీవితంలో పోగొట్టుకున్న దేమిటో. అదే అన్నాడు. అందుకామె వెంటనే అడిగింది.

"అవునూ, మరి మీరు పెళ్లెందుకు చేసుకోలేదు?"

"ఏ కలవారి పిల్లా నన్ను కోరి వరించి, కష్టాలు కొనితెచ్చుకోదు. ఇంక-పేదరికాన్ని పేదరికం పెళ్లిచేసుకుంటే, ఆ పెళ్లి ప్రాణాంతకమవుతుంది...."

"బావుందండీ, ఆ లెక్కన ఇంక బీదవాళ్లెవరూ పెళ్లిళ్లు చేసుకోరా, పిల్లల్ని కనారా?" అని నిలదీసింది నీహారిక.

"ఎందుకు కనరు? మా అమ్మ ఉంది గదా...." అన్నాడు మోహన్ విధిలేక నవ్వి.

పెట్టిన కలవు పూర్తయ్యాక నీహారిక, మోహన్‌తో కల్సి ఆఫీసుకు వెళ్ల సాగింది. ఒక ఆడదీ, మగాడూ ఒంటరిగా ఉంటనే ఎక్స్‌రే కళ్లతో చూసే సమాజం వీళ్ల పోకడలను అమితమైన ఆసక్తితో గమనించసాగింది. ఆ సంగతి నీహారికా గమనించింది.

మోహన్ తల్లి రోజూ సాయంత్రం వస్తూనే ఉంది. ఆ సమయానికి ఇదివరలో చుక్కలు లెక్కపెడుతుండే కొడుకు ఇప్పుడు ఓ చక్కని చుక్కతో కబుర్లాడుతూ కూర్చోవటం ఆమెకు నచ్చలేదు. అయినా తెగించి కొడుకును ఏమీ అడగలేదు. ఎందుకంటే కొడుకు దగ్గర పెళ్లి ప్రస్తావన అప్పుడప్పుడు తెచ్చింది. అందుకు చీవాట్లు తిన్నది.




"ఇది నీకు నామీదున్న ప్రేమకాదు. కట్నం డబ్బులమీద ఉండే ఆశ. ఆ సంగతి నాకు తెల్సుననీ నీకు తెల్సు. అయితే నీకు తెలియని విషయం ఒకటి ఉంది. ఈ కాలపు ఆడపిల్లలు ఎన్నో మధురమైన కాంక్షలతో పెళ్లి మంటపం ఎక్కుతారు. తీయనైన తలపుల భారంతో శిరసు వంగిపోగా, భర్త దగ్గరకొస్తారు. కానీ నా విషయం వేరు. ఎంతగా తప్పించుకుందామన్నా, నువ్వు నన్ను విడవటంలేదు. నీ సంసారాన్ని చూస్తూ స్వయంగా ఆ భారాన్ని మోయలేక కృంగిపోతూ కూడా మళ్లీ బుద్ధిలేకుండా నేను పెళ్లి ఎట్లా చేసుకుంటాను? అధవా, ఎప్పటికైనా మనసు మార్చుకుని చేసుకున్నా, కట్నం తీసుకోను. ఒకవేళ ఎవరైనా వెంటపడి- మొలతాడు కట్టిన ప్రతివాడూ తీసుకుంటున్నప్పుడు, నీకేమిటి తక్కువని బలవంతంగా లాంఛనంగా ఒక రూపాయి చేతిలో పెట్టినా, అందులో పదిపైసలు కూడా నీ కివ్వను. సరేనా?" అని కుండబద్దలుకొట్టి మరీ చెప్పాడు.

కానీ నీహారిక, మోహన్‌ల సాన్నిహిత్యం ఆమెకు మింగుడుపడటంలేదు. పైగా ఈ మధ్య నీహారిక వచ్చినప్పటి నుంచీ మోహన్‌కు కొన్ని కనిపించని ఖర్చులు పెరగటంతో, తల్లికి ఇవ్వటానికి ఏమీ మిగలటంలేదు. అయినా బాగా అయినవాళ్లు కాబట్టి ఊరికే పంపలేక, నాలుగు తిట్టి పంపిస్తున్నారు. ఒకప్పుడు తిట్టినా, మరొకప్పుడైనా పెట్టగల సామర్థ్యం ఉన్నవాడు వాడొక్కడే కాబట్టి, ఆ దూషణలే భూషణలుగా భావించటం ఆమె అలవాటు చేసుకుంది. ఇక ఇటునుంచి లాభంలేదని అటునుంచి నరుక్కురావాలనే ప్రయత్నంచేసింది.

మోహన్ లేనిసమయంలో నీహారిక మీద సానుభూతి వర్షం కురిపించింది. నచ్చచెప్పి పంపాలని చూసింది.

"కష్టాలు మనిషికి కాకపోతే మానుకు వస్తాయా? అయినా మొగుడు అన్నాక కొట్టాలి. పెళ్లాం అన్నాక పడాలి. మనది ధనియాల జాతి. ఆ విషయం మర్చిపోయి ఎగిరిపడితే ఎలా? పైగా మన బ్రతుకులు అరిటాకుల్లాంటివి. చిరిగితే ఎందుకూ పనికిరావు" అని హితబోధ చేసింది.

ఆమె మాటలు గురించి నీహారిక మోహన్‌కు చెప్పింది. అతను నొచ్చుకున్నాడు.

"తరాల మధ్యనున్న అంతరం నానాటికీ విస్తృతం అవుతోందని వాళ్లకి తెలియదు. వాళ్లకు తెల్సిందే వేదం అనుకుంటారు. ఆ వేదన ఇప్పుడెందుకని మనం అనుకుంటాం.... కరుడుగట్టిన వాళ్ల మౌఢ్యాన్ని కరిగించాలని నేను

ఎంతో ప్రయత్నించి విసిగి, వేరేగా ఉంటున్నాను...."

మోహన్ తల్లిని దండించాక రెండు రోజులు రావటం మానేసింది.

ఒకనాటి ఉదయమే నీహారిక భర్త వచ్చాడు. తన ఇంటికి వస్తావా, రావా అని ఆమెను నిలదీశాడు. రానుపొమ్మంది. చెయ్యి పట్టుకుని లాక్కుపోయే ప్రయత్నం చేశాడు. కొరికి విడిపించుకుంది. అయినా మళ్లీ పట్టుకున్నాడు. ఆ స్థితిలో మోహన్ కలగజేసుకున్నాడు. అడ్డం వెళ్లాడు.

"అది నా పెళ్లాం. నేను దాని మొగుణ్ని. తీసుకువెళ్తాను. మధ్యలో నువ్వెవరు?" అని దబాయించాడు.

"నువ్వు మొగుడివి కావు. యముడివి– అందుకే నీకు విడాకులు ఇవ్వబోతోంది...." అన్నాడు మోహన్.

"ఇచ్చి నిన్ను చేసుకుంటుందా?" అని వెటకారంగా అడిగాడు.

"అది నీ కనవసరం...."

ఈ గొడవకి నలుగురూ పోగయ్యారు. ఇటూ అటూ విన్నారు.

"నా పెళ్లానికి మాయమాటలు చెప్పి తీసుకొచ్చాడు. దాన్ని పాడుచేస్తున్నాడు. నా సంసారాన్ని కూల్చేస్తున్నాడు. ఇంతా చేసి నువ్వు దానికి ఏమవుతావంటే అది నీకు అనవసరం అంటున్నాడు– వినండి సార్" అని ఫిర్యాదు చేసాడు పెద్ద మనుష్యులకు.

ఒక గంటసేపు యాగీచేశాక, పెద్ద మనుష్యుల కోరికమీద ఆమె మొగుడు వెళ్లిపొయ్యాడు.

ఆ షాక్‌నుంచి తట్టుకోలేక భోరున ఏడుస్తున్న నీహారికను ఓదార్చటం మోహన్‌కు చేతకాలేదు. చాలాసేపు కన్నీటివర్షం కురిసి వెలిసింది.

"నాకు శాంతి లేదు, భద్రత లేదు" అందామె దుఃఖంతోనే.

"ఆ రెండూ బజార్లో కొనుక్కునేవి కావు. మనకు మనం కల్పించుకోవాల్సినవి." అన్నాడు మోహన్.

"దినదిన గండంగా ఎన్నాళ్లు బతకాలి?...." అని ఎంతో బెంగగా అడిగింది. నవ్వి మోహన్ అన్నాడు.

"నీకో కథ గాని కథ చెబుతాను విను.... అమెరికావాళ్లు అణుశక్తి ప్రయోగాన్ని జరపటంకోసం ఓ నిర్మానుష్యమయిన దీవిని వెతుక్కున్నారు. అయితే అక్కడ దోమలు విపరీతంగా ఉన్నాయి. ముందా దోమల్ని చంపితే గాని, అక్కడికెవరూ వెళ్లలేరని తెల్సుకున్నారు. అందుచేత హెలికాప్టర్లలో నుంచి ఆ దీవినిండా బెత్తెడు మందాన దోమలమందు చల్లారు. ఆ మందు ప్రభావానికి ఆ దోమలన్నీ చచ్చిపోయి ఉంటాయని, కొన్నాళ్ల తర్వాత వెళ్లి చూస్తే, ఆ దోమలన్నీ బాగా బలిసి ఈగల్లా తయారైనయి. ఎందుకు చెబుతున్నానంటే కష్టాలు కమ్ముకుని వచ్చినప్పుడే వాటిని తట్టుకుని నిలబడే శక్తి అలవడుతుంది. కాలుష్యం పెరుగుతుంటే దాన్ని తట్టుకోగల ఇమ్యూనిటీ కూడా క్రమంగా పెరుగుతోంది ...."

"మీరెన్ని చెప్పినా నా విషయం వేరు. బ్రతుకుమీద విశ్వాసమే తుది విశ్వాసం విడవబోతోంది. ఈ బాధను తట్టుకోవటం నావల్ల కాదు...." అంది దృఢనిశ్చయంతో.

"నీదీ ఒక బాధేనా?" అని ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"కాదా?" అని ఇంతలేసి కళ్లతో వింతగా చూసింది.

"హిరోషిమా, నాగసాకిలపై బాంబులు వేసినప్పుడు చచ్చినవాళ్లు చావగా, బ్రతికినవాళ్లకు చచ్చినంత పని అయింది. ఇన్నేళ్ళ తర్వాత ఇప్పటికీ వాళ్లకు భయం వదల్లేదు. వియత్నాం యుద్ధ రంగంలో పనిచేసిన వేలాదిమంది పిచ్చివాళ్లయిపొయ్యారు. ఇప్పటికీ కళ్లు మూసుకుపడుకుంటే, రంయ్‌మని దూసుకువస్తున్న విమానాలు, బాంబులు పేలిన శబ్దాలూ, కాళ్లూ, చేతులూ, తెగిపడిన మొండిశవాలు, రక్తప్రవాహాలు, కుళ్లిపోయిన మృతదేహాల మధ్య తమ అనుభవాలు వెన్నంటివస్తుంటే భయంతో కెవ్వున అరిచి లేచి కూర్చుంటున్నారు. మృత్యుదేవత శీతల కరస్పర్శ ఎలాంటిదో ప్రత్యక్షంగా చూసినవాళ్లే అయినా బతుకుమీద మమకారానికి దూరంకాలేదు ....మనకన్నా దుర్భరంగా బతుకుతున్న వాళ్లెందరో ఉన్నారని గుర్తుచేసుకుంటే కొంత ధైర్యం వస్తుంది...."

"ఏమో, మీరు దగ్గరున్నంతసేపే నాకు ధైర్యం.... అటు తిరిగితే చాలు గుండె డొల్లయిపోతుంది...."

"డొల్ల ఎలా అవుతుంది? గుండె లయబద్ధం అబద్ధం కాదు...."

"ఆయన గురించిన భయమే కాదు, నలుగురూ ఏమనుకుంటారోనని...."

"ఏ పాపమూ చేయనప్పుడు భయమెందుకు?"

నీహారిక నిట్టూర్చింది. ఎన్నో విధాల నచ్చచెబితే తేరుకుంది. తిరిగి మనిషి అయింది.

మళ్లీ మోహన్ తల్లి వచ్చింది. నీహారిక ఆమెతో మాట్లాడటం మానేసింది. అంచేత ఆమె కొడుకు దగ్గరకే వెళ్లి కూర్చుంది.

"నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారా?" అంది ఉపోద్ఘాతంగా. "నాకు చిన్నతనంగా ఉంది....".

"నేను అంత కానిపని చేస్తున్నప్పుడు నా దగ్గర కెందుకొచ్చావు?"

"చెప్పిచూడటం నా విధి.... మీ రిద్దరూ పెళ్లిచేసుకుంటున్నా రటగా?"

"ఏమో, మాకు మాత్రం తెలియదు."

"లోకం కదా, ఎవరినోరు మూస్తాం...."

"వద్దులే, నీ కెందుకా శ్రమ...."

"ఇంతదాకా వచ్చింది కాబట్టి, పెళ్లి

చేసుకోవటమే నాకూ మంచిదనిపిస్తోంది ...."

"ప్లేటు ఫిరాయించావేఁ?"

"పెళ్లి అయ్యాక కూడా, నేను నిన్ను డబ్బుకోసం పీడించటం బాగుండదు."

"నా చెవులు నన్ను మోసంచేస్తున్నాయి."

"ఉభయతారకంగా నేనోటి ఆలోచించాను. మీరిద్దరూ సంపాదించుకుంటున్నారు కాబట్టి నాకు నెలకో వంద ఇచ్చెయ్యండి. తర్వాత నీకు రావాల్సిన ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, ఫామిలీ బెనిఫిట్ ఫండ్— అలాంటి వాటి అన్నిటినుంచీ వచ్చే డబ్బు నాకు చెందేటట్లు నాపేర నామినేషన్ రాయి...."

తల్లి మాటలు విన్న మోహన్ ఆశ్చర్యపొయ్యాడు. మనసు ఒకనిముషం ఆలోచించటం మానేసి మొద్దుబారిపోయింది. తేరుకున్నాక అడిగాడు.

"ఈ ఆలోచన నీకే వచ్చిందా? ఎవరన్నా చెప్పారా?"

"నాకే వచ్చింది" అన్నదామె గర్వంగా.

"నీ ఐడియా దివ్యంగా ఉంది. కానీ అవన్నీ నేను రిటైర్ అయ్యాక గాని రావు. అప్పటిదాకా నువ్వు బతికే ఉంటావా?"

"నిక్షేపంలా ఉంటాను. మా అమ్మమ్మ తొంభై ఏళ్లు బతికింది. మా అమ్మ ఎనభై తొమ్మిదేళ్లు బతికింది. నేను పిడిరాయిలా ఉన్నాను. కనీసం ఎనభై ఎనిమిదేళ్లు బతుకుతాను...."

"అప్పటికీ నీ సంసారం, కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనమరాళ్లు, వాళ్ల సంతానం, సంసారాలు అన్నీ కలుపుకుంటే ఓ చిన్న మున్సిపాలిటీ తయారు అవుతుంది. దానికి నువ్వే మొదటి మహిళా ఛైర్మన్.... నీ ఆలోచనలు, పనులు చూస్తే పరమ రోతగా ఉంది. నా ముందునుంచి వెంటనే వెళ్లిపో. లేకపోతే ఈ క్షణంలోనే నీకు తొంభై ఏళ్లు నిండిపోతాయి. మీ అమ్మమ్మ పక్కలోకి వెళ్లిపోతావ్...." అంటూ తరిమేశాడు.

జరిగినదంతా నీహారికతో చెబితే నవ్వింది. "ఆమె పరిస్థితికి జాలేస్తుంది. కానీ ఎంత లేమిలో ఉన్నా, కొడుకు చచ్చిపోతే వచ్చే డబ్బుతో బతకాలనుకునే లేకితనాన్ని భరించలేం...."

"ఆమె ఈ విధంగా నాకా విషయాన్ని గుర్తుచేసింది. నాకు రావాల్సిన వాటికి అన్నిటికీ మీపేర నామినేషన్ చేస్తాను..."

"నేను మీకు ఏమవుతానని?...."

"ఓ మంచి స్నేహితురాలివి కాకూడదా? జీవితంలో ఎన్నడూ ఎవరి స్నేహానికి నోచుకోనిదాన్ని. అందుకే నీతో సాన్నిహిత్యం, ఎడారి దారిలో ఎండమావిలా కనిపిస్తోంది...."

"ఇంతకీ మనది స్నేహమా, మోహమా, రాగమా, విరాగమా?" అని అడిగింది నీహారిక.

"అవన్నీ ప్రతివాళ్ల జీవితంలోనూ ఎదురయ్యే పరిణామదశలే.... అందుకే స్నేహం ఎప్పుడూ ప్రతిఫలాపేక్ష లేని ఆపేక్షతో నిండి ఉండాలి.... అలుమగలను ఆత్మీయతానుబంధంతో కట్టేసేది పెరిగి తరిగే మోహం కాకూడదు. శాశ్వత స్నేహమే అయివుండాలి...."

"అలాంటి శాశ్వత స్నేహాన్ని నేను కోరుకొంటున్నాను" అంది నీహారిక.

"నేనూను..." అన్నాడతను. అప్పుడు ఒరుసుకున్న ఆ చూపులకున్న అయస్కాంత శక్తి, రెండు శరీరాలను దగ్గరకు లాగేసింది.

అనుకున్నట్లుగానే మర్నాడు మోహన్ నీహారిక పేరునే నామినేషన్ ఇచ్చాడు. ఆ విషయం వినగానే నీహారిక అధికారికంగా అతని భార్య స్థానాన్ని పొందిన అనుభూతికి లోనైంది.

ఆ సాయంత్రం అతను కోఠీలో దిగాడు. ఆమె వద్దన్నా వినకుండా. భార్య గాని భార్యకు ఏదో బహుమతి కొనాలని అతని ఉద్దేశ్యం. రాత్రికి ఆ బహుమతిని చూపించి ఆశ్చర్యపరచాలని అతని చిన్న కోరిక....

ఇంటికి వెళ్లే బస్సుకోసం ఎదురు చూస్తున్న మోహన్‌కు చిన్ననాటి ఫ్రెండు ఒకడు చాలాకాలం తర్వాత కల్సాడు. అతని స్కూటర్‌మీద ఎక్కాడు. ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు ఎదురుగా వచ్చే లారీని చూడలేదు. చాదర్‌ఘాట్ బ్రిడ్జిమీద యాక్సిడెంటు అయింది. ఇద్దరూ అక్కడికక్కడే....

ఈ వార్త వినగానే నీహారిక హృదయంలో కల్లోల ఉల్లోలాలు. కళ్లు తిరిగినయి. ఉన్న ఒకే ఒక్క ఆధారం ఒరిగిపోయింది. అంతరంగంలో అందంగా పేర్చుకున్న ఆశాసౌధాన్ని విధి ఫెడేలున తన్నేసి వెళ్లిపోయింది. నీహారికకు తన కాళ్లమీద నిలబడే శక్తిలేక కూలబడిపోయింది.

ఏది జరగకూడదో అది జరిగాక, ఎవరెంత వగచినా, వెరచినా ఫలితం ఏముంది?

మోహన్ కుటుంబం అంతా వచ్చి తిట్టి, దీవించి ఇదంతా నీహారిక చలవే నన్నారు. చూడవచ్చిన ఆఫీసు వాళ్లెవరో చెప్పారు కాబోలు. మోహన్ తల్లి దుమ్మెత్తి పోసింది.

"డబ్బుకోసం కావల్సినవన్నీ రాయించుకుని, నువ్వే చంపేసావు." అని మీదపడిపోయింది. డబ్బు అతని తల్లికే ఇచ్చేస్తానని అందరిముందూ వాగ్దానం చేయించుకుని గాని మరీ వదల్లేదు.

మర్నాడు పొద్దున్నే— గుమ్మంలో ఎదురుగా విషపునవ్వు నవ్వుతూ నిలబడ్డాడు నీహారిక మొగుడు. పడగ విప్పిన కోడెతాచులా కనిపించాడు. ఆమె గజగజా వొణికిపోయింది. ఎందుకంటే....

అతను అంగారతల్పం. ఆమె నీహారిక. దగ్గరకు వస్తే చాలు—

కరిగి, కన్నీరై, వరదై, వాగై.... పోతుంది.

———